'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'ఈఎన్‌టీ ఎసెన్షియల్స్- ముక్కు, చెవి, గొంతు సమస్యలు' అనే అంశంపై డాక్టర్ ప్రియాంక వల్లూరి ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

శంకర్‌గౌడ్‌కు నివాళి



రాయదుర్గం: తెలంగాణ ఉద్యమకారుడు కొండకల్ శంకర్‌గౌడ్‌కు శుక్రవారం నివాళి అర్పించారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చెన్నం రాజు, అంజమ్మ, దారుగుపల్లి నరేష్, పెద్దగోని రమేష్‌గౌడ్, ఆకుల యాదగిరి, బురాన్, బాలమణి, మాధవి, సుగుణ పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం .... గురువారం నిర్వహించిన డ్రైవ్‌లో 15 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఒకరికి రూ.1500 జరిమానా, మరో 14 మందికి రూ. వెయ్యి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన



ఎల్లమ్మ చెరువు వద్ద పైపులైన్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు వద్ద సుమారు రెండున్నర కోట్ల నిధులతో చేపడుతున్న పైపులైన్ పనులను శుక్రవారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతినగర్ పరిసర ప్రాంతాల నుంచి వస్తున్న డ్రైనేజీ నీరు ఎల్లమ్మ చెరువులో కలుస్తుండడంతో దోమల బెడద, దుర్వాసన సమస్యలు తలెత్తుతున్నాయని పైపులైన్ నిర్మాణం పూర్తయితే ఎల్లమ్మ చెరువు స్వచ్ఛంగా తయారవుతుందన్నారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, ఎంఆర్‌కె రెడ్డి, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

లీకేజీలను అరికట్టాలి



వాటర్‌వర్క్స్ అధికారులతో సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

కూకట్‌పల్లి: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమతానగర్ కాలనీ మూడవలైన్ ప్రాంతంలో మంజీరా నీరు డ్రైనేజీ నీటితో కలసి సరఫరా అవుతోందని కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, వాటర్‌వర్క్స సిబ్బందితో కలిసి పరిశీలించారు. వెంటనే లీకేజీ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. వాటర్ వర్క్స సూపర్‌వైజర్ నరేంద్ర, వాటర్ లైన్‌మెన్ శ్రీకాంత్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్, ఎల్లమ్మబండ పరిధిలోని దత్తాత్రేయ కాలనీలోని శ్రీ నాగలింగేశ్వర స్వామి దేవస్థానం 7వ వార్షికోత్సవం సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జిల్లా గణేష్‌లు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో నాగభూషణం, కృపాకర్‌గౌడ్, యాదగిరి, శంకర్‌గౌడ్, మహేష్, ఆదర్శ్, పోశెట్టి గౌడ్, నాగార్జున, దేవేందర్, రామకృష్ణ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రధానరోడ్డుపై పట్టింపేదీ..?

నాలా విస్తరణ పూర్తి....రోడ్డు అసంపూర్తి



మార్తాండనగర్ బస్తీ నుంచి వెళ్లే నాలా పక్కన ఉన్న రోడ్డు

- మార్తాండనగర్ ప్రధాన రోడ్డు గుంతలమయం.. చెత్త చెదారం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

చందానగర్: కొండాపూర్ డివిజన్ పరిధి మార్తాండనగర్ నుంచి వెళ్లే లింక్‌రోడ్డు గుంతలమయంగా మారింది. చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా మారింది. మార్తాండనగర్ నుంచి వెళ్లే ఓపెన్ నాలాపై గతంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఫెన్సింగ్ నిర్మించారు. కానీ నాలా పక్కన రోడ్డు వేయడం మరిచారు. దీంతో రోడ్డంతా గుంతలుగా మారడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై బస్తీవాసులు చెత్త చెదారం వేస్తున్నారు. దీంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. చెత్తతో దోమలు ప్రబలాయని స్థానికులు వాపోతున్నారు. మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ నుంచి వెళ్లే వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. వెంటనే రోడ్డు పనులకు నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీ రోడ్డు వేయాలి



మార్తాండనగర్- ప్రేమ్‌నగర్ బస్తీలో సీసీ రోడ్లు వేశారు. కానీ ప్రధాన రోడ్డును అలాగే వదిలేశారు. గుంతలమయంగా మారిన రోడ్డును సీసీ రోడ్డుగా చేయాలి. - సంతోష్, మార్తాండనగర్

ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి



మార్తాండనగర్ బస్తీ ప్రజలు ప్రధాన రోడ్డుపై చెత్త చెదారం వేస్తున్నారు. చెత్త కుప్పలను తొలగించి శుభ్రం చేయాలి. రోడ్డు వేసి వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

- కృష్ణ, మార్తాండనగర్

- మార్తాండనగర్ బస్తీలో అంతర్గత రోడ్లు మాత్రం సీసీ వేశారు. ప్రధాన రోడ్డు వదిలేశారు.
- ఈ రోడ్డుపై భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్త కుప్పలు పురుకుపోయాయి
- వీధి దీపాలు లేకపోవడంతో రాత్రిపూట ఇబ్బంది పడుతున్నారు.
- ప్రేమ్‌నగర్ నుంచి లింక్ రోడ్డుకు వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయాలి.



రోడ్డు పక్కన భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్త కుప్పలు



డంపింగ్ యార్డును తలపిస్తున్న దృశ్యం



అస్తవ్యస్తంగా..

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మియాపూర్: మదీనాగూడ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.శనివారం ఉదయం 9 గంటల నుండి 10.30 గంటల వరకు పీఏనగర్, కృషినగర్, స్టాలిన్‌నగర్, డీకేఎన్‌క్లేవ్, రాఘవేంద్ర మిత్రా అపార్ట్‌మెంట్, రాఘవేంద్ర పాంచజన్య అపార్ట్‌మెంట్, అదేవిధంగా 10 గంటల నుండి 11.30 గంటల వరకు స్వర్ణపురి కాలనీ రోడ్డు -14 నుండి 22 వరకు, జనప్రియ వెస్ట్‌సిటీ ,కృష్ణసాయి ఎన్‌క్లేవ్, ముక్తమహబూబ్‌పేట్, జేపీఎన్‌నగర్, నాగార్జున ఎన్‌క్లేవ్, సాయంత్రం 3 గంటల నుండి 5 గంటల వరకు మియాపూర్, బాలాజీనగర్, ఆర్‌బీఆర్ కాంప్లెక్స్, ఎఫ్‌సీఐ, వీడియా కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు

- 11 కేవీ గోపన్‌పల్లి ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల వరకు గోపన్‌పల్లి తండా, గోపన్‌పల్లి ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.
- 11కేవీ నేతాజీనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు నేతాజీనగర్, డాక్టర్స్ కాలనీ ఏరియాల్లో..
- 11 కేవీ సాయిరాం నగర్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10 గంటల నుంచి 10.30 గంటల వరకు సాయిరాం నగర్ కాలనీ, డైమండ్ హైట్స్ కాలనీల్లో ..
- 11 కేవీ దూబే కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల వరకు దూబే కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండని ఏఈ తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు జయభేరీ, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్, ఖాజాగూడ, ఏపీ అట్లాంటిక్ అపార్ట్‌మెంట్స్, వీకర్ సెక్షన్ కాలనీ, ఓక్రిడ్జ్ స్కూల్, కుమ్మరిబస్తీ, సాయి ఐశ్వర్య కాలనీ, అపర్ణ టవర్స్, నానక్‌రాంగూడ, మీనాక్షి, జేవీ కాలనీ, మహిళా మండలి లేన్, గాయత్రి నెస్ట్, ఆర్‌టీటీసీ, వినాయక్‌నగర్, వెంకటేశ్వరస్వామి టెంపుల్, శ్రీరాంస్కూల్, ఎమ్రాల్డ్ గార్డెన్, చర్చ్ విలేజ్, సుమధురా అపార్ట్‌మెంట్స్..

- మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంబికా సూపర్‌మార్కెట్, పెద్దమ్మటెంపుల్, బీఎన్‌రెడ్డి, చౌరస్తా, ఓల్డ్ గచ్చిబౌలి, ఇందిరానగర్, సెంట్రల్‌మాల్, నానక్‌రాంగూడ, సాయి ఐశ్వర్య కాలనీ, మీనాక్షి,జర్నలిస్ట్ కాలనీ, 60 యార్డ్స్, రాయదుర్గం, మధురానగర్, ప్రశాంతిహిల్స్, ఎంజేఆర్ దాబా, కాలోజీ చౌరస్తా, అలయ్‌బలాయ చౌరస్తా, పద్మశ్రీగార్డెన్, శ్రీజ హాస్పిటల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదని గచ్చిబౌలి ఏఈ వెంకటరమణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

చందానగర్‌లో..

చందానగర్: చందానగర్ సెక్షన్ పరిధిలోని హఫీజ్‌పేట్, మదీనాగూడ సబ్‌స్టేషన్‌ల పరిధిలో 11 కేవీ ఫీడర్ల మరమ్మతుల కారణంగా .. వైశాలీనగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి 4.00 వరకు వైశాలీనగర్, ఏపీజీఓ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

- హనుమాన్ టెంపుల్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9.00 గంటల 11.00 వరకు మైత్రీనగర్ ఫేజ్ 3, మదీనాగూడ విలేజ్ ఏరియాలలో ..
- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో ..మధ్యాహ్నం 3.00 గంటల నుంచి 4.00 గంటల వరకు వినాయక్ నగర్, ప్రకాష్‌నగర్ ఏరియాలలో..
- ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలో.. ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, ప్రకాష్‌నగర్, వినాయక్‌నగర్ ఏరియాలలో విద్యుత్ ఉండదు.

వేమనకాలనీ సెక్షన్‌లో..

వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..సురక్షా ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 వరకు విద్యానగర్, సురక్షా ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి నగర్, సత్య ఎన్‌క్లేవ్, శుభోదయ కాలనీ, అపర్ణ హెటీ సర్వీస్ ప్రాంతాలలో ..

- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 వరకు ఫ్రెండ్స్ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్, అర్జున్‌రెడ్డి కాలనీ, వెస్ట్ మెట్రో అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో..
- భవానీపురం ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 నుంచి 11.00 వరకు రాజేందర్‌రెడ్డి కాలనీ, అమీన్‌పుర మెయిన్ రోడ్డు, పద్మజ కాలనీ ఏరియాలలో..

హఫీజ్‌పేట్ సెక్షన్‌లో..

హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని.. మ..3.00 గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- మైత్రీనగర్ ఫీడర్ పరిధిలో.. జనప్రియ అపార్ట్‌మెంట్, జనప్రియనగర్, భాను టౌన్‌షిప్, హే మధుర టవర్స్, ఆల్విన్ క్రాస్ రోడ్డు ప్రాంతాలలో ..
- న్యూ ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలో.. ఆదిత్యనగర్ రోడ్డు నెంబర్ 1 నుంచి 14 వరకు, కృష్ణ కాలనీ ఏరియాలలో ..
- సుభాష్‌చంద్రబోస్ నగర్ ఫీడర్ పరిధిలో.. ఎస్‌సీబీ నగర్‌లో
- కల్యాణ్ గార్డెన్స్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు మాతృశ్రీనగర్ మెయిన్ రోడ్డు, బొమ్మరిల్లు, రాజారాం కాలనీ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కూల్చివేతలు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో రెవెన్యూ అధికారులు శుక్రవారం కూల్చివేతలను చేపట్టారు. ఖాజాగూడ సర్వే నంబర్- 27లో రెండు గదులను నిర్మాణం చేశారని ఫిర్యాదు రావడంతో రెవెన్యూ అధికారులు పరిశీలించారు. శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్, తహశీల్దార్ ఆదేశంపై ఆర్‌ఐ చంద్రారెడ్డి నాయకత్వంలో సిబ్బంది జేసీబీతో రెండు గదులను కూల్చివేశారు.

రాష్ట్రంలో విద్యా సంస్కరణలు అవసరం

ఏఐఓబీసీఎస్‌ఏ ఆధ్వర్యంలో విద్యా కమిషన్‌కు వినతి



తెలంగాణ విద్యా కమిషన్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న బృందం

రాయదుర్గం: రాష్ట్రంలో బీసీ విద్యార్థుల కోసం సమగ్ర విద్యా సంస్కరణలు అవసరమని కోరుతూ నగరంలో విద్యా కమిషన్‌కు ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ బృందం శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు.ఏఐఓబీసీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు, హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థి కిరణ్‌కుమార్, కార్యదర్శి అరుణ్‌కేతన్, మురళీయాదవ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జీ రామ్‌గౌడ్‌లతో కూడిన బృందం 5 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ముఖ్యంగా ప్రతిమండలం లో బీసీ హాస్టళ్లలో గ్రంథాలయాలు, శానిటేషన్, డిజిటల్ సదుపాయాలతో అభివృద్ధి చేయాలన్నారు. బీసీ సంక్షేమ ఇంటర్ కళాశాలలను పూర్తి స్థాయి డిగ్రీ కళాశాలలుగా మార్చాలని కోరారు. బీసీల కోసం ఉన్నత విద్యలో రెసిడెన్షియల్ సివిల్ సర్వీసెస్ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు, హాస్టల్ విద్యార్థులు నెలవారీ జేబు ఖర్చులు, ఉచిత ఇంటర్నెట్ అందించాలని కోరారు. రాష్ట్రంలోని ఒక విశ్వవిద్యాలయానికి మహా త్మా జ్యోతిరావుపూలే విశ్వవిద్యాలయంగా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి జిల్లాలో నవోదయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్ళు, కేంద్రీయ విద్యాలయాలను నెలకొల్పేలా కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడి చేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మియాపూర్: కాలనీ, బస్తీలలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. మియాపూర్‌లోని టీఎస్ నగర్ కాలనీవాసులు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను కలిసి కాలనీ, బస్తీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో చంద్రకళ, నర్సింలు, రాములు, వెంకటేష్, బాలమణి, రూప, పాండు తదితరులున్నారు.



కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను కలిసిన టీఎస్‌నగర్ కాలనీవాసులు

నేడు శని త్రయోదశి పూజలు

పటాన్‌చెరు టౌన్: శని త్రయోదశి సందర్భంగా పటాన్‌చెరు శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేయనున్నట్టు ఆలయ అర్చకులు మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం ఉదయం 5 గంటల నుండి 10 గంటల వరకు పూజలు జరుగుతాయని తెలిపారు.

50 పడకల ఆసుపత్రిగా మార్చాలి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను 50 పడకల ఆసుపత్రిగా మార్చాలని సీపీఎం కూకట్‌పల్లి మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కార్యదర్శి ఎం. శంకర్, కమిటీ నాయకులు పి. ధర్మారావు తదితరులు యూపీహెచ్‌సీని సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూకట్‌పల్లి మండలంలో లక్షలాది జనాభా ఉందని కేవలం అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ద్వారా సరైన వైద్యం అందటం లేదన్నారు. ఎమర్జెన్సీ వస్తే కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. పేదలు వైద్యం చేయించుకోలేక అవస్థలు పడుతున్నారని, చాలీచాలని జీతాలతో కుటుంబం గడవడమే కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణులకు ప్రసూతి సౌకర్యం కూడా అందుబాటులో లేదని, కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇక హెల్త్ సెంటర్‌లో సరైన సౌకర్యాలు లేవని, ఫర్నిచర్ కూడా సరిగ్గా లేదని పేర్కొన్నారు. మే 12న కలెక్టర్ ఆఫీస్‌వద్ద జరిగే ధర్నా కార్యక్రమానికి ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు.



హెల్త్ సెంటర్‌ను పరిశీలించిన సీపీఎం నాయకులు

భారత సైన్యం పేరిట ప్రత్యేక పూజలు



ధ్యాన మారుతి మందిరంలో హోమం చేస్తున్న అర్చకులు



గణేష్‌గడ్డ దేవస్థానంలో ..

మియాపూర్: మయూరినగర్ కాలనీలోని శ్రీ ధ్యాన మారుతి మందిరంలో భారత సైన్యం పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆదేశాల మేరకు ఆపరేషన్ సిందూర్‌లో పోరాడుతున్న భారత్ సైన్యానికి మద్దతుగా స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. రుద్రసహిత సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ ఈఓ అరుణకుమారి, అర్చకులు శివశ్రీ భృంగీశ్వర్ స్వామి, అర్చకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గణేష్‌గడ్డలో పూజలు నిర్వహించిన అర్చకులు

పటాన్‌చెరు టౌన్: భారత త్రివిధ దళాలు క్షేమంగా ఉండాలని, సైన్యానికి భగవంతుని ఆశీస్సులు ఉండాలని తెలంగాణ ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ శాఖ సూచనల మేరకు శుక్రవారం గణేష్‌గడ్డ దేవస్థానంలో అర్చకులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని పూజలు నిర్వహించినట్లు తెలిపారు .భారత సాయుధ దళాలు దిగ్విజయంగా రావాలని పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశే ఖర్,అయ్యప్ప, సతీశ్,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా 2025-26 సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పటాన్‌చెరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ ,బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్సెస్ ,ఫిజికల్ సైన్సెస్, బీబీఏ కోర్సులు మొత్తం 780 సీట్లు ఉన్నాయని, దోస్త్ ద్వారా ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు మీసేవ కేంద్రాల్లో లేదా ఆన్‌లైన్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఫేజ్-1 రిజిస్ట్రేషన్ ప్రక్రియ మే 3వ తేదీ నుండి 21వ తేదీ వరకు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల దోస్త్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సురేష్ కుమార్ 9666266222ను సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు కొత్తదనంను అన్వేషించాలి

ఏజీవర్సిటీ: విద్యార్థులు సంప్రదాయ విద్యా మార్గానికి భిన్నంగా ఆలోచించాలని... ఆ ఆలోచనలను ఆచరణలోకి తెచ్చేందుకు కృషి చేయాలని ఐసీఎఆర్ నారమ్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు వ్యవస్థాపకత అభివృద్ధిపై 3 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శిక్షణలో గోపాల్‌లాల్‌తో పాటు , వీసీ దండా రాజిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా పట్టణ వ్యవసాయం, స్మార్ట్ వ్యవసాయం, వెల్నెస్ ఆధారిత ఉత్పత్తులు వంటి కొత్త వాటి గురించి అన్వేషించాలని సూచించారు. నూనెలు, పర్యావరణ అనుకూల ఎరువులు వంటి విలువ ఆధారిత ఉత్పత్తులను వ్యాపార మార్గాలుగా పరిగణించాలని విద్యార్థులకు సూచించారు.

నల్లగండ్లలో సినీనటి హిమజ సందడి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ నియోమాల్‌లో బార్బెక్యూ నేషన్ అవుట్‌లెట్‌ను సినీనటి హిమజ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హిమజ మాట్లాడుతూ ఏదైనా ఫుడ్ అన్ లిమిటెడ్ అనగానే బార్బెక్యూ నేషన్ గుర్తుకు వస్తుందన్నారు. బార్బెక్యూ నేషన్ హాస్పిటాలిటీ లిమిటెడ్ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మన్సూర్ మెమన్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో 14వ అవుట్‌లెట్ ప్రారంభించామని వెజ్, నాన్‌వెజ్ రుచులతో కూడిన వంటకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.



వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

శేరిలింగంపల్లి: వరద ముంపు శాశ్వత పరిష్కారానికి నాలా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి నేతాజీనగర్ నుంచి నల్లగండ్ల మార్కెట్ వరకు నాలా రిటైనింగ్ వాల్, బెడ్‌వర్క్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు వరద ముంపుతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఆయా పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటరమణ, డిప్యూటీ సిటీ ప్లానర్ తులసిరామ్, డీఈ ధీరజ్, ఏఈ యుగంధర్, టీపీఎస్ జిషాన్ పాల్గొన్నారు.

